# కొన్ని మినీ కవితలు

--- *మూలా సుబ్రహ్మణ్యం*

**రైలుబండి**

కొందరికి ఆనందాన్ని
మరికొందరి విషాదాన్ని
మోసుకుంటూ రైలుబండి
రానూ వచ్చింది
పోనూ పోయింది

కబుర్లలో మునిగిపోయి మనం
రైలు ఉనికినే గుర్తించం!

**ఆట**

తూగుడు బల్లాట
ఆడుకుంటూ
సూర్య చంద్రులు!

**బాల్యం**

తుప్పల్లోకి పోయిన బంతి
ఎప్పటికీ మరి కనిపించదు

**గోరింట**

అమ్మాయిలు రాత్రి పెట్టుకున్న గోరింట
ఉదయానికి పండితే

ఆకాశం ఉదయం పెట్టుకున్న గోరింట
రాత్రికి పండుతుంది!

**చుక్కలు**

రాత్రంటే
ఆకాశానికి సైతం
ఎంత ఆకర్షణో

ఒళ్ళంతా
కళ్ళు చేస్తుకుంది!

**మేఘం**

ఎంత చిత్రమైనదీ మేఘం
సరిహద్దులెరుగని స్వేచ్ఛకలిగీ
సూర్యుణ్ణిసైతం నిలువరించగలిగీ
ఏ చల్లని స్పర్శకైనా కరిగిపోతుంది

ఎంత తడిని
తనలో దాచిందో!

Copyright© 2005-06 eemaaTa.com. Content can not be reproduced without the permission of the author and the eemaaTa magazine. Contact eemaaTa at submissions@eemaata.com